


పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 9.235 క్యూసెక్కులు వస్తుండగా, 16 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో 41.39 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 6522 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 3040 క్యూసెక్కులు వదిలారు.

లక్ష్మీనరసింహుని కళ్యాణ వార్షిక వేడుకలు



బెల్లంకొండ: చంద్రాజుపాలెంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి తృతీయ వార్షిక కళ్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎన్జీ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ప్రయోజనాల కోసం నిరంతరం పాటుపడిన ఎన్జీ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. గురువారం రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి సందర్భంగా గుంటూరు బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మాజీ ఎంపీ శివాజీతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ మాట్లాడుతూ రాజకీయాల్లోకి వస్తున్న యువతరం ఆచార్య రంగా జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు.

10న బాలబాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ బాలబాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని పోటీల నిర్వాహకుడు ఎం.గోపీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఆదివారం గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తామన్నారు. మొత్తం నాలుగు విభాగాల్లో బాలబాలికలు పోటీపడతారన్నారు. విజేతలకు ట్రోఫీలను అందజేస్తామన్నారు. వివరాలకు 97030 49378 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నివాసాల మధ్య కొండచిలువ



తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెరికలపూడిలో నివాసాల మధ్య కొండచిలువ తిరుగుతూ ఉండడంతో గురువారం స్థానిక యువకులు దానిని పట్టుకుని చంపివేశారు. మూడు రోజుల నుంచి గ్రామ పరిధిలో, నివాసాల మధ్య తిరుగుతూ కోళ్లను తింటూ కొండ చిలువ తప్పించుకు తిరుగుతోంది. ఎట్టకేలకు పంచాయతీ కార్యాలయం వద్ద సంచరిస్తున్న కొండచిలువను యువకులు చంపివేశారు. కొండ చిలువ పొడవు 9 అడుగుల వరకు ఉందని తెలిపారు.

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ పాఠశాలలతోపాటు ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమయపాలన పాటించి, విధిగా హాజరు కావాలని సూచించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్న సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ హాజరవుతున్న దృష్ట్యా హెచ్‌ఎంలు గత మూడేళ్లలో టెన్త్ పరీక్ష ఫలితాలు, వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షల ప్రణాళిక, తదితర అంశాలతో హాజరు కావాలని ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ

అద్దంకి: ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళికి ఆరోగ్యం అని బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ అన్నారు. ఆమె గురువారం బాపట్ల జిల్లా గోవాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయంతో దేశవాళీ వరి రకాలను పండిస్తున్న నరిశెట్టి రమేష్‌బాబు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రత్నచోడి, జమ్ముతావి, ఇన్నపు సాంబ, చంద్రగండు, కాలాబట్టీ, కాలాభట్, కొల్లం, మధుమాలతి వంటి పది రకాల పురాతన దేశీయ రకాలను రమేష్‌బాబు తన పది ఎకరాల భూమిలో పండిస్తున్నారని చెప్పారు. పలువురు రైతులకు విత్తనాలను సరఫరా చేస్తున్నారన్నారు. పలు రకాల కషాయాలు వాడి పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఆమెతో పాటు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోకిల వనజా రాణి, పద్మలత, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

విద్యా లోపాల వినాస్‌ని

- విద్యార్థుల ప్రతిభ గుర్తింపునకు పరీక్ష
- ముమ్మరంగా ఏర్పాట్లు
- ఓఎంఆర్ విధానంలో నిర్వహణ
- బోధనా సామర్థ్యాల అంచనాకు తోడ్పాటు
- జిల్లాలో 138 పాఠశాలలు ఎంపిక



సత్తెనపల్లి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పరిశీలించేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పేరుతో పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది.. సమున్నత లక్ష్యంతో ముందుకు సాగేలా విద్యావ్యవస్థలో నిరంతరం కసరత్తు జరుగుతోంది. విద్యార్థి తరగతి వారీగా అభ్యాస సామర్థ్యాలు సాధించేలా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాయి. చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాల స్థాయి ఎలా ఉందనే విషయాన్ని తేట తెల్లం చేసేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఉపకరిస్తుంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి నాస్ సర్వే నిర్వహిస్తుండగా, చివరిగా 2021లో నిర్వహించారు.

నాస్ లోగో

తిరిగి ఈ ఏడాది నిర్వహించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీలు చర్యలు చేపడుతున్నాయి. ప్రస్తుతం నిర్వహించే నాస్ సర్వేకు ముందుగా గత ఏడాది నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పేరుతో మండల స్థాయిలో సర్వే చేపట్టారు. దీని ఆధారంగా మన విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలిసింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేస్తున్నారు.

4,140 మందికి పరీక్ష

డిసెంబర్ 4న నిర్వహించే నాస్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 138 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,140 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్ర శిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపల్, డీఈవో కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌లు ఈ పరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా ఎంఈఓ -1,-2తో పాటు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారు. అయితే ఏయే పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారు అనేది స్పష్టం కావాల్సి ఉంది. నాస్ పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. పరీక్ష నిర్వహించేందుకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు (ఎఫ్ఐ)లను ఎంపిక చేయనున్నారు. డైట్, బీఎడ్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ విద్యాభ్యాసం సాగిస్తున్న శాస్త్ర ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులను క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు (ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు)గా నియమించనున్నారు.

నాస్ సర్వే చేపడతారిలా..

విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేందుకు దేశ వ్యాప్తంగా డిసెంబర్ 4న నాస్ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలూ కలిపి 2,040 పాఠశాలలు ఉండగా 2.90 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది నాస్ సర్వేలో 3,6,9 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. గతంలో 3, 5, 8 తరగతులకు ఈ పరీక్షలు నిర్వహించారు.

ప్రాక్టీస్ పేపర్లతో తర్ఫీదు

ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే ఈ పరీక్షకు ముందుగా సరఫరా చేసిన ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు ఇస్తారు. తద్వారా ఈ పరీక్షను సమర్థవంతంగా రాసే అవకాశం ఉంటుంది. 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతికి సంబంధించిన సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతికి సంబంధించిన సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష ఉంటుంది. 3, 6 తరగతుల విద్యార్థులు 40 ప్రశ్నలకు 60 నిమిషాల సమయంలో, 9వ తరగతి విద్యార్థులు 60 ప్రశ్నలకు 90 నిమిషాల వ్యవధిలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్ష ఉంటుంది.

సత్తెనపల్లిలో మంత్రి మనోహర్ తనిఖీలు

- ఐదు బృందాలతో వలు రైస్ మిల్లులపై దాడి
- పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తింపు
- ఓ రైస్ మిల్లు సీజ్ చేయాలని అధికారులకు ఆదేశాలు

సత్తెనపల్లి: గుంటూరు, పల్నాడు జిల్లాలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వెయ్యి మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుకొని క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలు ఇచ్చారు. సత్తెనపల్లి టౌన్‌లో సీతారామాంజనేయ సాయి, గణేష్ రైస్ మిల్ ఫ్లోర్ మిల్, శ్రీదేవి ట్రేడర్స్, రావు రైస్ మిల్ ఫ్లోర్ మిల్, సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో రైల్వే గేటు వద్ద గల ఆంజనేయ ట్రేడర్స్ రైస్ మిల్లుకు తాళాలు వేసి ఉండటంతో తాళాలను పగలగొట్టించి లోపలకి వెళ్ళి అక్కడ ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. మిల్లులో ఎక్కువ మొత్తంలో బియ్యం లూజుగా ఉండటంతో వాటిని బస్తాలకు నింపే ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. అధికారులు తనిఖీలకు వస్తున్నారన్న సమాచారం తెలుసుకొని మిల్లులో పాత బిల్లులను తగలబెట్టినట్లు గుర్తించారు. మొత్తం ఐదు బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఆంజనేయ ట్రేడర్స్ రైస్ మిల్లులో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి ఆ మిల్లును సీజ్ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రేషన్ బియ్యం పెద్ద ఎత్తున ఉన్నా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని తహసీల్దార్ కె.ఎస్.చక్రవర్తిని ప్రశ్నించారు. ఆయనపై చర్యలకు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరేకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని రోడ్డు పక్కన ఉన్న చిన్న టీ స్టాల్ వద్ద కూర్చొని నాదెండ్ల మనోహర్ టీ తాగుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలపై ఆరా తీశారు. తనిఖీల పరంపర ఇంకా కొనసాగుతూ ఉంది. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ సబ్సిడీ ధరలపై కందిపప్పు, పంచదార, పామాయిల్ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. దీపం-2 పథకం గురించి వివరించారు. ఆయన వెంట సత్తెనపల్లి ఆర్డీవో గాజులపల్లి వెంకట రమాకాంత రెడ్డి ఉన్నారు.



సత్తెనపల్లిలో బిల్లులు కాల్చివేయడాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మద్యం దుకాణం తొలగించాలని

విద్యార్థుల ఆందోళన

సాక్షి, నరసరావుపేట: బడి, గుడికి అత్యంత సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. దాచేపల్లి మండలం కేసానుపల్లి రైల్వేగేట్ సమీపంలో ఇటీవల మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఈ దుకాణానికి కూతవేటు దూరంలో ప్రైవేట్ పాఠశాల, చర్చి, దేవాలయాలు, నివాస గృహాలు ఉన్నాయి. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక మహిళలు రోడ్డెక్కి మూడు రోజుల క్రితం ఆందోళన చేశారు. తాజాగా ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతోపాటుగా స్థానికులు మద్యం దుకాణం తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. తమకు చదువులు ముఖ్యమని, మద్యం దుకాణం పెట్టి తమను ఇబ్బందులు పెట్టవద్దని విద్యార్థులు వేడుకొన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మద్యం దుకాణం తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులు, స్థానికులతో మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో మాట్లాడి అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.



మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు

భర్త ఆచూకీ తెలపండి

సీఐకి మహిళ వేడుకోలు



పలపాల నాగమణి

దుర్గి: తన భర్త గత నాలుగు రోజులుగా ఇంటికి రావట్లేదని, ఫోన్ స్విచాఫ్ వస్తోందని పలపాల వెంకటేశ్వర్లు భార్య నాగమణి గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. మించాలపాడు గ్రామస్తులు కొందరి మాటలు విని ఎస్ఐ తనను వేధిస్తున్నారని వెంకటేశ్వర్లు తీసుకున్న సెల్ఫీ వీడియో వైరల్ అయిన నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య నాగమణి గురువారం దుర్గి పోలీసు స్టేషన్ వద్దకు వచ్చి ఎస్ఐ సుధీర్‌బాబును కలిసేందుకు యత్నించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో అదే సమయంలో దుర్గి పోలీసు స్టేషన్‌కు వచ్చిన కారంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావును కలిసి గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఇంటి వద్ద తన పిల్లలు వాళ్ల నాన్న కోసం ఎదురు చూస్తూ అన్నం ముట్టడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఆమెతో పాటు వెంకటేశ్వర్లు తల్లి అచ్చమ్మ, కొందరు బంధువులు వెంకటేశ్వర్లు ఆచూకీ కనుక్కోవాలని సీఐని వేడుకొన్నారు. కొన్ని రోజులుగా గ్రామంలో కొంతమంది, వారి కుటుంబ సభ్యులు తమను బూతులు తిడుతూ వేధిస్తున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. వెంకటేశ్వర్లుకు ఎటువంటి హానీ జరగకముందే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమ కుటుంబాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

చీరాల అర్బన్: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన చీరాలలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, జాండ్రపేట హైస్కూల్, చౌకధరల దుకాణాలు, పౌరసరఫరాల గొడౌన్‌లను ఆయన పరిశీలించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో వసతులు సరిగా లేవని స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ దగ్గుబాటి రాంబాబు ఆయనకు ఫిర్యాదు చేశారు. దాతలు 20 క్యాన్ల మంచినీరు ఇస్తే హాస్టల్‌కు ఆరు క్యాన్లు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో గత ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా నిర్మించిన మంచినీటి ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని విజయప్రతాప్ రెడ్డి గుర్తించారు. మెమోలు జారీ చేస్తామన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హాస్టళ్లలో పలు సమస్యలు ఉన్నాయని చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూ అమలు చేస్తున్నా నాసిరకం కూరగాయలు, పాలు తగిన నాణ్యత లేకపోవడం, చికెన్ కూడా తగినంత ఇవ్వకపోవడం వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు. వేటపాలెంలో ఓ హైస్కూల్‌లో 210 మందికి అరకొరగా సాంబారు చేశారని వెల్లడించారు. మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. వేటపాలెం హైస్కూల్లో వంట ఏజెన్సీని రద్దు చేయాలని డీఈఓకు సిఫార్సు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆహార పంపిణీలో లోటుపాట్లను సరిదిద్దుతామన్నారు. తాము కూడా సుమోటోగా కేసులు తీసుకుని జరిమానాలు విధిస్తామన్నారు.

ప్రపంచ వేదికపైకి 'కోటి' ఆశలతో..

'పంచ్' ప్రాణాలూ పణంగా పెట్టి

- పతకాల వేటే లక్ష్యం
- విజయాల పరంపర
- ఏషియన్ కిక్ బాక్సింగ్‌లో కాంస్యం
- ఇటలీలో జరిగే ప్రపంచ కప్‌కు అర్హత
- రాష్ట్రంలోనే తొలి క్రీడాకారుడిగా గుర్తింపు
- కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న కోటి నాగబాబు



ప్రపంచకప్ పోటీలకు స్పాన్సర్‌షిప్ చేస్తామని హామీ ఇస్తున్న రామచంద్ర ప్రభు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఎవరి సాయం లేకుండా అకుంఠిత దీక్షతో కఠోర సాధనతో క్రీడల్లో రాణించే వారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిని వారు సాధించిన విజయాలే ప్రపంచానికి పరిచయం చేస్తాయి. ఇదే కోవకు చెందుతారు కోటి నాగబాబు. ఆయన కిక్ బాక్సింగ్‌లో దూసుకుపోతున్నారు. ఏషియన్ పోటీల్లో సత్తాచాటి ఇటలీలో జరిగే ప్రపంచ్ కప్‌కు అర్హత సాధించారు. అంతర్జాతీయ యవనికపై గుంటూరు కీర్తిని రెపరెపలాడించేందుకు సిద్ధమవుతున్నారు.

సరదాగా ప్రారంభించి..

గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులో ఉంటున్న యాసం కోటి నాగబాబు స్వగ్రామం రేపల్లె దగ్గర్లోని కారుమూరు. తండ్రి శ్రీనివాసరావు. తల్లి లంకా బసవపూర్ణమ్మ వీఆర్ఏ. తండ్రి దూరంగా ఉంటున్నారు. తల్లి సంపాదనే కుటుంబానికి ఆసరా. అయినా నాగబాబు పేదరికాన్ని ఎదిరించి తనకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నారు. సినిమాల ప్రభావంతో సరదాగా తైక్వాండోలో శిక్షణ తీసుకున్నారు. మూడేళ్ల సాధన తర్వాత కిక్ బాక్సింగ్‌పై అతని దృష్టి మళ్లింది. ఈ సమయంలో ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉన్న కోటిని ఓ పెద్దాయన ఏటుకూరుకు చెందిన సీతారామయ్యకు పరిచయం చేశారు. దీంతో సీతారామయ్య కోటిని సొంత బిడ్డలా చూసుకుంటూ ఆశ్రయం కల్పించారు. వసతులు సమకూర్చారు. దీంతో 15 నెలల నుంచి కోటి కిక్ బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. సీతారామయ్య సూచనతో తులసి సీడ్స్ అధినేత రామచంద్రప్రభు కూడా కోటికి ఆసరాగా నిలిచారు. సహకారం అందిస్తానని మాట ఇచ్చారు.

కఠోర సాధనతో ఇంటర్నేషనల్ బాక్సర్‌గా..

దీంతో కోటి పట్టుదలతో శిక్షణ కొనసాగించారు. కఠోర సాధన చేశారు. ఫలితంగా గత నెల కాంబోడియాలో జరిగిన ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 84 కేజీల విభాగంలో కాంస్య పతకంతో సహా రెండు పతకాలు సాధించి ఔరా అనిపించుకున్నారు. ఏపీ నుంచి ఈ పతకాలు సాధించిన తొలి వ్యక్తి కోటి కావడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చిలో ఇటలీలో జరగనున్న వరల్డ్ కప్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ కిక్ బాక్సర్ హోదాను పొందారు.

సాధించిన విజయాలు

- 2023లో విశాఖలో జరిగిన జాతీయ శిక్షణ ట్రైల్స్‌లో కాంస్యం పతకం.
- అదే ఏడాది పంజాబ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ నేషనల్స్‌కు అవకాశం.
- మొత్తం 54 విభాగాల్లో 7,000 మంది పాల్గొన్న సీనియర్ నేషనల్స్ మహాటోర్నీలో 17వ స్థానం.
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో సిమ్లాలోని షిలారు కోచింగ్ క్యాంప్‌కు అర్హత.
- విదేశీ కోచ్‌ల తర్ఫీదులో కొత్త మెళకువలు
- ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో రెండు కాంస్య పతకాలు.
- ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు

కిక్ బాక్సింగ్ ప్రాణం

ప్రాణం పణంగా పెట్టి కిక్ బాక్సింగ్‌కు సిద్ధమవుతున్నా. పేద కుటుంబం నుంచి వచ్చా. సీతారామయ్య, రామచంద్రప్రభుల సహకారంతో ముందుకు సాగుతున్నా. వారి రుణం తీర్చుకోలేనిది. ఇంటర్నేషనల్ కోచ్ (ఏపీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు) జి.ఆనంద్ పాల్ శిక్షణలో ఎంతో నేర్చుకుంటున్నాను. జిల్లా తరఫున ప్రపంచ కప్ పోటీల్లో దేశానికి పతకం తేవడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. ప్రస్తుతం నాకు విదేశీ కోచ్‌ల శిక్షణ చాలా అవసరం. శాప్‌లో ప్రస్తుతం కిక్ బాక్సింగ్ లేదు. దీనిని కూడా ఏర్పాటు చేయాలి. ఏషియన్ మెడల్స్ సాధించడంలో ఎందరో సహకారమందించారు. వారికి ధన్యవాదాలు.

– యాసం కోటి నాగబాబు, ఇంటర్నేషనల్ కిక్ బాక్సర్



కాంబోడియాలో జరిగిన ఏషియన్ పోటీల్లో పతకంతో విజయ దరహాసం

యార్డులో 49,882 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 48,327 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 49,882 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 17,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

పీఆర్, గ్రామీణాభివృద్ధి శిక్షణ పర్యవేక్షకులు కేశవరెడ్డి



మాట్లాడుతున్న కేశవరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామ సమగ్రాభివృద్ధికి దోహదం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖల శిక్షణ పర్యవేక్షకుడు ఆర్.కేశవరెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేశవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో స్థానిక అవసరాలైన సామాజిక న్యాయం, సంక్షేమాలను దృష్టిలో ఉంచుకుని అన్ని మార్గాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. దీనికోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. డ్వామా పీడీ వి.శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో రూ.రెండు కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు పనులు చేపట్టేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. ప్రజా ప్రణాళికపై రిసోర్స్ పర్సన్ కె.లలిత మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, బడ్జెట్ రూపకల్పనలు, సక్రమ వినియోగం గురించి వివరించారు. యాప్‌లు, సాంకేతిక అంశాలపై డీపీఎం రవీంద్రబాబు వివరించారు. ఈవోపీఆర్డీ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆర్థిక వనరుల సక్రమ వినియోగం, ఆదాయ వనరుల సంక్షేమ కార్యక్రమాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు వి.శ్రీనివాసరావు, కరీముద్దీన్, మేడికొండూరు ఎంపీడీవో తోట చందన, జిల్లా సమన్వయకర్త ఎస్.పద్మారాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

12, 13 తేదీలలో వర్సిటీ మహిళా కబడ్డీ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ పోటీలను కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 12, 13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు గురువారం తెలిపారు. పోటీలలో భాగంగా వర్సిటీ మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేస్తారని తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల జట్లు పోటీలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో పోటీల నిర్వహణ ఉంటుందని వివరించారు. పోటీలో పాల్గొనే జట్లు తమ వివరాలను ఈనెల 11వతేదీ లోగా అందచేయాలని కోరారు. వివరాలకు 9985373066 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఎరువుల నిల్వలపై తనిఖీ



నరసరావుపేట రూరల్: రైల్వే స్టేషన్‌లోని ఎరువుల రేక్ పాయింట్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ గురువారం తనిఖీ చేశారు. జిల్లాకు 1250 మెట్రిక్ టన్నుల యూరియ వచ్చినట్లు తెలిపారు. ఇందులో 525 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్, కో–ఆపరేటివ్ సొసైటీలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 525 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్స్, గ్రోమోర్ సెంటర్లకు తరలిస్తున్నట్లు వివరించారు. 100 మెట్రిక్ టన్నులను గుంటూరు జిల్లాకు పంపుతున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచేవిధంగా ఎప్పటికప్పుడు మస్తానమ్మ తెలిపారు.

14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్



గుంటూరు మెడికల్: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ర్యాలీ ఏర్పాటు చేశారు. దీనిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ సీడీ 3.0 కార్యక్రమం ఈ నెల 14న ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎం, ఆశ, సీహెచ్‌ఓలు ప్రతి మంగళ, గురు, శుక్రవారాలలో ఇళ్లను సందర్శించాలన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి 'సాహో'

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి 'సాహో' ప్రత్యేక ప్రణాళిక ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు సమీకరిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం సాయంత్రం గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో వైద్య సౌకర్యాలు మెరుగు పరిచేందుకు జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో 60 అంశాలపై చర్చించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించామన్నారు. బొంగరాలబీడు ఈఎస్ఐ హాస్పిటల్ స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నందున ఆ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం ప్రముఖ పారిశ్రామిక వేత్త తులసి రామచంద్రప్రభు రూ. 5 కోట్లు విరాళం ఇస్తామని గతంలో హామీ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుత అంచనాల ప్రకారం నిర్మాణ ఖర్చులు పెరిగిన దృష్ట్యా తన స్నేహితుడు రూ. కోటి విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థులకు ఉపయోగపడేలా బస్సు ఏర్పాటు చేస్తామని, జన ఔషధి మెడికల్ షాపులు ఆసుపత్రిలో పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తులసి రామచంద్రప్రభు నర్సింగ్ విద్యార్థుల కోసం రూ. 50 లక్షలతో బస్సు కొనుగోలుకు ముందుకు వచ్చారని వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు రూ. 6 లక్షల విలువైన పరికరాలను అందజేసినట్లు వెల్లడించారు. కాలేయ సమస్యతో బాధపడుతున్న గుంటూరుకు చెందిన 12 సంవత్సరాల లక్ష్మణ ఆదిత్యకు ఇటీవల కాలేయ మార్పిడి జరిగిందని మంత్రి తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఆర్థిక సమస్యలు రావడంతో బాధితులు తమను సంప్రదించగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 7 లక్షలు సహాయం అందించామని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సాహో పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెమ్మసాని. పక్కన కలెక్టర్ నాగలక్ష్మి

పీఆర్‌సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలి

ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసెఫ్ సుధీర్‌బాబు డిమాండ్

వినుకొండ(నూజెండ్ల): పీఆర్‌సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి కమిటీ నివేదిక వచ్చేవరకు వెంటనే 35 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసెఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు అయి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పీఆర్‌సీ కమిటీ గురించి కనీసం ఊసెత్తడం లేదని, వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసర ధరల పెరుగుదల మేరకు కరువు భత్యాయన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆగిరిపల్లి ట్రైనింగ్ సెంటర్‌లో ఉండి ప్రధానోపాధ్యాయులు మృతిచెందారని, బాపట్ల శిక్షణ కేంద్రంలోనూ ఉపాధ్యాయులు అస్వస్థతకు గురయ్యారని, నాన్ రెసిడెన్షియల్ విధానంలో ట్రైనింగ్‌లు జరపాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన ప్రధానోపాధ్యాయులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జీవో నెం. 117ను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ ఒకే పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎల్.వి. రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, నాయకులు మహబూబ్ సుభాని, వెంకట్‌రెడ్డి, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్‌బాబు

వివాహితపై అత్యాచారయత్నం

నాదెండ్ల: వివాహిత పట్ల ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన వ్యక్తి స్థానికంగా టైల్స్ పనులకు వెళ్తుంటాడు. ఇతనికి భార్య, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం భార్య ఇంట్లో వంట చేస్తుండగా, ఇదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బత్తుల భరత్ ఇంట్లోకి చొరబడి వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో వివాహిత కేకలు వేయటంతో పరారయ్యాడు. సాయంత్రం 5 గంటల సమయానికి భర్త ఇంటికి రాగా జరిగిన విషయాన్ని వివరించింది. బాధిత దంపతులు నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

- యువతలో అవగాహన పెరగాలి
- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు

మంగళగిరి: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు అని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం సెల్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో ఇండియా కంపెనీతో కలిసి ఈ వేస్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. దృశ్యమాధ్యమ పద్ధతిలో వీడియో సందేశాన్ని కలెక్టర్ పంపారు. గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమస్యను పరిష్కరించడంలో ముందుకు రావాలన్నారు. ఒప్పో ఇండియా కంపెనీ ప్రజావ్యవహారాల విభాగాధిపతి రాకేష్ భరద్వాజ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సెల్‌ఫోన్ల తయారీలో రెండవ స్థానంలో ఉన్నా భారత్‌లో ఈ వేస్ట్ సైక్లింగ్‌లో వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 50 మిలియన్ల టన్నులు ఈ వేస్ట్ పేరుకుపోతోందని, దీనిని ఎప్పటికప్పుడు తగ్గించకపోతే పర్యావరణానికి ప్రమాదం తప్పదన్నారు. ఇన్‌చార్జి వీసీ భరద్వాజ్ శివకుమారన్, డీన్ డాక్టర్ సీవీ టామి, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ రంగభాష్యం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డెబ్లినా దత్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాకేష్ భరద్వాజ్

హిందీ పరీక్షలో తెనాలి విద్యార్థిని ప్రతిభ



తెనాలి: హిందీ ప్రేమీమండలి మహా విద్యాలయం 9వ తరగతి విద్యార్థిని రాసంసెట్టి పూజిత గోవర్ధన భవాని (14) దక్షిణ భారత హిందీ ప్రచార సభ(ఆంధ్ర) నిర్వహించిన మధ్యమ పరీక్షలో ప్రథమంగా ఉత్తీర్ణత సాధించింది. హిందీ ప్రచారసభ కార్యదర్శి జానకి ఈ మేరకు సమాచారం పంపారు. బాలికను మండలి అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నలుగురు వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్టు

మాచర్ల: పట్టణంలో టీడీపీ కార్యాలయానికి సంబంధించి గత సంవత్సరం జరిగిన దాడిలో నలుగురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారనే ఆరోపణలతో గురువారం సీఐ ప్రభాకరరావు అరెస్టు చేశారు. 2023 డిసెంబరు 16న వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతల మధ్య మున్సిపల్ కార్యాలయం ఎదుట ఘర్షణ జరిగింది. దీనిపై పలు కేసులు నమోదయ్యాయి. ఘర్షణలో పలువురిని నిందితులుగా పేర్కొన్నారు. పట్టణ పోలీసులు గురువారం ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా కాశయ్య, చల్లా మోహన్, పి.ప్రసాద్, మాచర్ల మాజీ సొసైటీ అధ్యక్షుడు టి.వెంకట రామయ్యలను అరెస్టు చేసి మాచర్ల కోర్టులో హాజరు పరిచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. నలుగురిని గురజాల సబ్ జైలుకు తరలించారు.

శిశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

గుంటూరు మెడికల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి గురువారం గుంటూరు జీజీహెచ్ నవ జాత శిశు రక్షణ వార్డును సందర్శించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా ప్రపంచ శిశు రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. నవజాత శిశువులకు అందుతున్న వైద్య సేవల గురించి శిశువుల తల్లులు, వైద్యులతో మాట్లాడి ఆమె తెలుసుకున్నారు. నవజాత శిశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు వివరించారు. పుట్టినప్పటి నుంచి శిశువులకు ఇవ్వాల్సిన టీకాలు, తల్లిపాల ప్రాధాన్యత, పౌష్టికాహారం ఏవిధంగా అందించాలనే విషయాలను వివరించారు. కాలుష్య రహిత గాలి శిశువులకు అందేలా చూడాలన్నారు.



శిశువు తల్లితో మాట్లాడుతున్న లీలావతి

విద్యార్థుల అంతర్జాతీయ పర్యటనపై ఐఎస్సీ ప్రత్యేక శ్రద్ధ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున వర్సిటీ విద్యార్థుల విదేశీ పర్యటనపై ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ (ఐఎస్సీ) ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి తెలిపారు. విదేశీ పర్యటన ముగించుకుని ఏఎన్‌యూకి చేరుకున్న ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు షేక్ సమీర్, టి వసంత బాబులకు వీసీ ఆచార్య కె. గంగాధరరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మావతి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు జపాన్‌లో గత నెలలో జరిగిన సకురా ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం–2024లో పాల్గొన్నారని తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యాచురల్ మెడిసిన్‌లో వివిధ ఔషధాల పనితీరును విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్ఎస్ఎస్ఎన్ రవికుమార్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రెండవ రోజు విజృంభించిన ఆంధ్ర క్రికెట్ జట్టు

- సెంచరీతో నాటౌట్‌గా నిలిచిన ఏఎన్‌వీ లోహిత్
- 615 పరుగుల భారీ స్కోర్ సాధించిన ఆంధ్ర జట్టు



సెంచరీతో నాటౌట్‌గా నిలిచిన లోహిత్



5 వికెట్లు సాధించిన నౌనిహాల్

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కూచ్ బెహరా ట్రోఫీ అండర్ –19 మ్యాచ్‌లో రెండవ రోజు ఆంధ్ర బ్యాటర్ల విజృంభణతో జట్టు 615 పరుగుల భారీ స్కోర్ సాధించింది. 315 పరుగుల తొలి రోజు స్కోర్‌తో రెండవ రోజు గురువారం ఆట ప్రారంభించిన జట్టు 65 ఓవర్లలో 300 పరుగులు చేసింది. మొత్తం 155 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 615 పరుగులు సాధించింది. రెండవ రోజు జట్టు బ్యాట్స్‌మెన్ ఏవీఎన్ లోహిత్ 121 బంతులలో 3 సిక్స్‌లు, 7 ఫోర్లతో 100 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. కె.రేవంత్ 163 బంతులలో 3 సిక్స్‌లు రెండు ఫోర్లతో 72 పరుగులు, టి వరుణ్ సాత్విక్ 135 బంతులలో 8 ఫోర్లతో 68 పరుగులతో రాణించారు. హిమాచల్ ప్రదేశ్ బౌలర్ ఆర్ నౌనిలాల్ 5 వికెట్లతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హిమాచల్ ప్రదేశ్ జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 50 పరుగులు చేసింది.

సమస్యలు పరిష్కరించలేని గ్రామసభలెందుకు.?

వరగానిలో అధికారులకు రైతుల సూటి ప్రశ్న

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలపై రైతులు పెదవి విరుస్తున్నారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు ఈ సభల నిర్వహణ ఎందుకని గళం విప్పుతున్నారు. పెదనందిపాడు మండలం వరగానిలో గురువారం రెవెన్యూ అధికారులు సర్వే సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించేందుకు గ్రామసభ నిర్వహించారు. హాజరైన రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఒక రైతు తన పొలం సర్వేకు ముందు ఆన్‌లైన్‌లో నమోదయ్యిందని, సర్వే చేసిన తరువాత ఆన్‌లైన్‌లో పేరు నమోదు కాలేదని అధికారుల వద్దకు వెళ్లి తన సమస్యను విన్నవించారు. పరిష్కారం కోసం కార్యాలయానికి రావాలని సభకు హాజరైన అధికారులు సూచించారు. దీంతో ఆగ్రహించిన రైతు సమస్యలు పరిష్కారం కానప్పుడు గ్రామసభలు నిర్వహించడం ఎందుకని, సభను రద్దు చేయాలని మండిపడ్డాడు. దీంతో పక్కనే ఉన్న గ్రామస్తులు, రైతులు ఆ రైతును శాంతింపజేశారు. ఇదిలా ఉంటే సమస్య ఉంటే అర్జీలు ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారని, అర్జీలు రాయడం కొందరు రైతులకు రాదని, అలాంటి వారికి అర్జీలు రాసేందుకు కూడా స్థానికంగా సిబ్బంది అందుబాటులో లేరని రైతులు వాపోయారు.



గ్రామ సభ రద్దుకు డిమాండ్ చేస్తున్న వరగాని రైతు

నేడు సత్తెనపల్లిలో.. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

- 13 జిల్లాల నుంచి రానున్న 26 బాల, బాలికల జట్లు
- 540 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్‌లు, 20 మంది రిఫరీలు రాక
- సత్తెనపల్లి శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాలురుకు, నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలికలకు పోటీలు



ముస్తాబైన క్రీడా మైదానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మొత్తం మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 26 బాల, బాలికల జట్లు హాజరుకానున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి. నరసింహారావు గురువారం తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 540 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్‌లు, 20 మంది రిఫరీలు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున క్రీడా సందడి నెలకొననుంది. పట్టణంలోని శరభయ్యగుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాలురకు, సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలికలకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. క్రీడాకారులకు, క్రీడలను వీక్షించే క్రీడాభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వార్నిష్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం

తెనాలి రూరల్: వార్నిష్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం చోటుచేసుకుంది. మండలంలోని సోమసుందరపాలెం ఆటోనగర్‌లో కోస్టల్ కెమికల్ ఇండస్ట్రీస్ పేరిట కలపకు వేసే వార్నిష్ తయారీ కేంద్రం నడుస్తోంది. బుధవారం అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో నిర్వాహకుడు మహమ్మద్ రియాజ్ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకుడు తెలిపారు.



దగ్ధమవుతున్న తయారీ కేంద్రం

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు దోపిడీ

పెదకాకాని: ఇల్లు అద్దెకు కావాలని వచ్చి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన కొప్పురావూరు గ్రామంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో నివాసం ఉంటున్న వృద్ధురాలు బొర్రా సుజాత వద్దకు గురువారం ఉదయం 10.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పోస్టుమెన్‌గా పనిచేస్తున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. తన భార్య సమీపంలోని విశ్వశాంతి స్కూల్‌లో టీచర్ అని చెప్పాడు. రోజూ గుంటూరు నుంచి ఇంటికి రావడానికి ఇబ్బందిగా ఉంటుందని.. ఇల్లు అద్దెకు కావాలన్నారు. ఇల్లు చూసుకుంటున్నామని నమ్మించాడు. ఆ వృద్ధురాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా మూడు ఇళ్లు చూసి... సాయంత్రం తన భార్యను తీసుకుని వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం 3 గంటల సమయంలో తిరిగి కొప్పురావూరు చేరుకుని తన భార్య ఈ రోజు రాలేనని చెప్పిందని పేర్కొన్నాడు. రేపు వస్తామని చెప్పి వెళ్లడానికి వచ్చానని వృద్ధురాలిని నమ్మించాడు. తాగడానికి నీళ్ళు ఇమ్మని చెప్పడంతో లోపలికి వెళ్లింది. వెంట ఆతడు కూడా వెళ్ళి మెడలో బంగారు చైన్ లాక్కుని క్షణాల్లో మాయమయ్యాడు. వృద్ధురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కొప్పురావూరు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

వేటపాలెం: రామన్నపేట స్ట్రయిట్ కట్ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. ఎస్సై వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతోందన్న సమాచారంతో అక్కడకు వెళ్లి పరిశీలించామన్నారు. మృతుడికి దాదాపు 55 ఏళ్లు ఉంటాయని, కేవలం బులుగు నిక్కరు మాత్రమే ఉందని తెలిపారు. రెండు రోజుల కిందట కాల్వలో పడి పైనుంచి నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చి ఉంటాడని భావిస్తున్నారని న్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్త చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు, పక్కన ఎస్ఐ ప్రకాశరావు

రూ. 7.50 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

తెనాలి రూరల్: డిగ్రీ చదివిన యువకుడు కారు డ్రైవరుగా పని చేస్తూ చెడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. తెనాలి బాలాజీరావుపేటలో వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ వివరాలను సీఐ ఎస్. రమేష్ బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం... విజయవాడ కొత్తపేటలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌కు చెందిన గుదే హరీష్‌కు మార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తున్నాడు. గతంలో విజయవాడ, ఏలూరులో చోరీలకు పాల్పడి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ క్రమంలో తెనాలి బాలాజీరావుపేట కిరాయి కోసం వచ్చినప్పుడు అతడు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేస్తున్నాడు. బాలాజీరావుపేటలోనే ఏడాది వ్యవధిలో ఐదు దొంగతనాలకు పాల్పడ్డాడు. తాళం వేసి ఉన్న ఇంటి వెనుక తలుపును పగులగొట్టి లోనికి ప్రవేశించాక బీరువా, కబోర్డుల తాళం చెవులు వెతికేవాడు. దొరికితే వాటితో ఓపెన్ చేసి.. ఆభరణాలను తస్కరించేవాడు. విజయవాడలో తెలిసిన వ్యక్తి ద్వారా ఆభరణాలను గవర్నర్‌పేటలో బంగారం నాణ్యత పరీక్షించే షాపులకు విక్రయించాడు. ఆ డబ్బుతో గోవాలో జల్సాలు చేసేవాడు. తిరిగి వచ్చాక డబ్బులు అవసరమైనప్పుడల్లా రైలులో తెనాలి రావడం స్టేషన్‌కు వచ్చేవాడు. సమీపంలోని బాలాజీరావుపేటలో చోరీ చేసి, తిరిగి రైలెక్కి విజయవాడ వెళ్లిపోతున్నాడు. ప్రత్యేక బృందం విజయవాడ వెళ్లి నిందితుడి కదలికలపై నిఘా ఉంచింది. చివరకు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తే.. వరుస చోరీల వ్యవహారం బయటపడింది. అతడి నుంచి సుమారు రూ. 7.10 లక్షల విలువైన బంగారు నగలు, రూ. 40 వేల విలువ చేసే వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో మరి కొందరిని అరెస్టు చేసి, మరింత బంగారం స్వాధీనం చేసుకోవాల్సి ఉందని సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ ఎ. ప్రకాశరావు, ఏఎస్ఐ ఎస్‌కే హైదర్ అలీ, కానిస్టేబుళ్లు పి.మురళి, ఎస్. జైకర్ బాబులను అభినందించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు బీరువా, ఇతర కబోర్డుల తాళం చెవులు ఇంట్లో ఉంచవద్దని సూచించారు. లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్) తెనాలి పోలీసుల వద్ద అందుబాటులో ఉందని, దానిని వినియోగించుకోవాలని సీఐ సూచించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు